క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. హుడా కాలనీ, ఎస్ఎంగూడ ఓహెచ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అభినందనలు



అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిసి అభినందనలు తెలియజేస్తున్న నేతలు

నాంపల్లి: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన అనిల్‌కుమార్ యాదవ్‌ను పలువురు కాంగ్రెస్ నేతలు అభినందించారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఖాన్, కార్యదర్శి మహ్మద్ ఇంతియాజ్, నాయకులు వెంకటేష్ అనిల్‌కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

సన్మానం



జీవన్‌సింగ్‌ను సన్మానిస్తున్న నరహరిచారి, బాబు, నర్సింహ

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎంతో పటిష్టతతో పనిచేస్తుందని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జియాగూడ కేశవస్వామినగర్‌లో డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జీవన్ సింగ్ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలోని జియాగూడ డివిజన్‌లో బీఆర్ఎస్‌కు ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మంతటి నర్సింహ, ప్రధాన కార్యదర్శి బాబు, రఘునాథ్, శంకర్‌సింగ్, మనోజ్ కుమార్, రాహులు, ప్రకాష్, గోపాల్ పాల్గొన్నారు.

భాగవత కథ సప్తాహం



సాక్షి, సిటీబ్యూరో: శ్రీగురుదేవ్ ప్రవీణ్ మహరాజు ఆధ్వర్యంలో షేక్‌పేటలోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆడిటోరియంలో జరిగిన భాగవత కథ సప్తాహం ముగిసింది. ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకూ ఈ సప్తాహం జరిగింది. బనారస్‌లోని బృందావన్ వేదిక్ స్టడీస్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసిన ప్రవీణ్ మహరాజు.. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి, నేటి తరానికి భాగవతం, భగవద్గీత సారాంశం తెలియజేయడానికి విశేష కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సూరత్‌కు చెందిన వినందా దంపతులు, హైదరాబాద్‌కు చెందిన శారదారెడ్డి పాల్గొన్నారు.

జంగల్ విఠోబా ఆలయ బ్రహ్మోత్సవాలపై సమీక్ష

అఫ్జల్‌గంజ్: జంగల్ విఠోబా ఆలయ బ్రహ్మోత్సవాలను ఈనెల 28 నుంచి జులై 6వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణంలో యుద్ధప్రతిపాదికన ఏర్పాట్లు చేయాలని జంగల్ విఠోబా ఆలయ అధ్యక్షుడు బీజేపీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండేయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో నిర్వహించారు. విఠలేశ్వర రుక్మాబాయిల బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం ఏకాదశిని పురస్కరించుకొని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఏసీపీ దేవేందర్, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ బుర్ర చిట్టి, రాజు మహారాజ్, మాణిక్‌రావు, రఘునందన్ యాదవ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

గోల్కొండ: కార్వాన్ డివిజన్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పుడు విధుల్లోకి వస్తారో, ఎప్పుడు రారో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. మరోవైపు ప్రధాన రహదారులపై డ్రైనేజీలు కూడా పొంగిపొర్లుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గుట్టలుగా చెత్త పేరుకుపోతుంది. అధికారులు కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ కార్వాన్ డివిజన్‌ను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అట్టహాసంగా వార్డు కార్యాలయాల ప్రారంభం

జియాగూడ: ప్రభుత్వం ద్వారా ప్రజలకు మరింత సేవలందించేందుకు జియాగూడ వార్డు కార్యాలయం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం జియాగూడ 2బీహెచ్‌కేలో నూతనంగా వార్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరై మాజీ కార్పొరేటర్ మిత్ర కృష్ణతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన వార్డు కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల సత్వార పరిష్కారం, డివిజన్ అభివృద్ధికి కోసం పూర్తి సహకారం అందిస్తానన్నారు. మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ మాట్లాడుతూ.. జియాగూడలో ఎమ్మెల్యే కౌసర్ వారంలో ఒకరోజు బస్తీల పాదయాత్ర చేపట్టాలన్నారు.

ప్రజలకు జీహెచ్ఎంసీ ద్వారా మెరుగైన సేవలు..

అబిడ్స్: ప్రజలకు జీహెచ్ఎంసీ ద్వారా మరింత మెరుగైన సేవలందించేందుకే వార్డు డెవలప్‌మెంట్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బేగంబజార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు అభివృద్ధి కార్యాలయాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ప్రజలకు అన్నిరకాల సేవలు వార్డు అభివృద్ధి కార్యాలయంలో చేపడుతారని ఆయన అన్నారు. గతంలో ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన వారు ఇప్పుడు వార్డు కార్యాలయానికి వస్తే వెంటనే అన్ని పనులు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, నందకిశోర్ వ్యాస్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, బీఆర్ఎస్ నేతలు పూజవ్యాస్ బిలాల్, ఆనందకుమార్ గౌడ్, ధన్‌రాజ్, శాంతిదేవి, సంజయ్, మనోజ్, ఉమేష్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హిందీనగర్‌లో..

గోషామహల్ హిందీనగర్‌లో వార్డు అభివృద్ధి కార్యాలయాన్ని హోంమంత్రి మహమూద్ అలీ



మాట్లాడుతున్న మంత్రి తలసాని, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

ప్రారంభించారు. ఈ కార్యాలయం ద్వారా ప్రజలకు, జీహెచ్ఎంసీకి సంబంధించిన పలు విభాగాలను సేవలను అందిస్తామని మహమూద్ అలీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంల గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, ధన్‌రాజ్, శాంతిదేవి, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే...

యాకుత్‌పురా: వార్డు కార్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సూచించారు. ఎస్ఆర్టీ కాలనీలో ఏర్పాటు చేసిన రెయిన్‌బజార్ వార్డు పాలన కార్యాలయాని ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డుల వారీగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విభాగాలతో వార్డు పాలనను తీసుకురావడం శుభపరిణం అన్నారు. జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ డీసీ నరసింహ, ఈఈ బస్వరాజు, యూసీడీ డీపీఓ రత్నమ్మ, వార్డు పాలన అధికారి నరహరి, ఏఎంహెచ్ఓ డాక్టర్ ఇర్షాద్ ఇక్బల్, పలు విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అమన్‌నగర్–బీ మోడల్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన తలాబ్ చంచలం డివిజన్ వార్డు పాలన కార్యలయాన్ని కార్పొరేటర్ డాక్టర్ సమీనా బేగం ప్రారంభించారు. వార్డు పాలన అధికారి మహేందర్, పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. సుల్తాన్‌షాహి ప్లేగ్రౌండ్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన మొఘల్‌పురా వార్డు పాలన కార్యాలయాని కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా ప్రారంభించారు.

గుడిమల్కాపూర్ వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవంలో రసాభాసా..

గోల్కొండ: గుడిమల్కాపూర్ వార్డు కార్యాలయాల ప్రారంభోత్సవ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రసాభాసా నెలకొంది. దేవర కరుణాకర్ మృతి చెందారని, అయితే ఆయన కుటుంబంలో ఏ ఒక్కరిని కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించకపోవడం పట్ల బీజేపీ నాయకులు దేవర వంశీ అధికారులను నిలదీశారు. ఎమ్మెల్సీ ప్రభాకర్ దేవర వంశీతో మాట్లాడి ముందు ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవన్ సింగ్, బీఎంసీ ఎన్‌కె అలీ తదితరులున్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ తదతరులు

కార్వాన్ నియోజకవర్గంలో..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని టోలిచౌకి నానల్‌నగర్, కార్వాన్, లంగర్‌హౌస్ డివిజన్‌లోని బల్దియా వార్డు కార్యాలయాలను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వం లక్షలాది రూపాయలను వెచ్చి వార్డు కార్యాలయాలను ఆధునీకరించిందని, ప్రభుత్వం లక్ష్యం నెరవేరాలంటే సిబ్బంది క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్ పలువురు బల్దియా అధికారులు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి వార్డు కార్యాలయాలు దోహదం..

దూద్‌బౌలి: సమస్యలను పరిష్కరించేందుకు వార్డు కార్యాలయాలు దోహదపడుతాయని చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం చార్మినార్ నియోజకవర్గంలోని పురానాపూల్ డివిజన్ షాగంజ్ వద్ద వార్డు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. పురానాపూల్ కార్పొరేటర్ రాజ్‌మోహన్, చార్మినార్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మహ్మద్ సలావుద్దీన్ లోధీ, పెండ్యాల లక్ష్మణ్‌రావు, మెహజబీన్ ఖురేషి, ఎంఐఎం నాయకులు హనీఫ్, ముజ్జు, రహీం, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



జియాగూడ వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్, మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ

చార్మినార్ నియోజకవర్గంలోని వార్డు కార్యాలయాలు ఇవే..

చార్మినార్: చార్మినార్ శాసనసభ నియోజకవర్గంలోని పత్తర్‌గట్టి, మొఘల్‌పురా, శాలిబండ, ఘాన్సీబజార్, పురానాపూల్ డివిజన్లకు చెందిన వార్డు కార్యాలయాలు శుక్రవారం అందుబాటులోకి వచ్చాయి. పురానాపూల్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రారంభించగా.. మిగిలిన వార్డు కార్యాలయాలను సంబంధిత కార్పొరేటర్లతో పాటు జీహెచ్ఎంసీ అధికారులు ప్రారంభించారు. ఘాన్సీబజార్ డివిజన్ వార్డు కార్యాలయాన్ని పేట్లబురుజులో ఏఐఎంఐఎం పార్టీ డివిజన్ అధ్యక్షులు సాహీల్ అక్బర్ ప్రారంభించారు. పత్తర్‌గట్టి కార్యాలయాన్ని మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్రారంభించగా.. మొఘల్‌పురా వార్డు కార్యాలయాన్ని సుల్తాన్‌షాహీ ప్లే గ్రౌండ్‌లోని కమ్యూనిటీ హాల్‌లో, శాలిబండ వార్డు కార్యాలయాన్ని షాగంజ్ హోటల్ వెనుకనున్న రూప్‌లాల్‌బజార్ కమ్యూనిటీ హాల్‌లో సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో పాటు కార్పొరేటర్లు ప్రారంభించారు.



ఎస్ఆర్టీ కాలనీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, అధికారులు



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్



ఘాన్సీబజార్ వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సాహీల్ అక్బర్



టోలిచౌకి వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్



అధికారులను నిలదీస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గోల్కొండ: వర్షాకాలంలో విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన రింగ్ రోడ్డులోని మొఘల్‌ఖనాల ఫంక్షన్ హాల్‌లో కార్వాన్ నియోజకవర్గానికి చెందిన విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పటిష్ఠమైన కంచె ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో విద్యుత్ ఎర్తింగ్ కాకుండా చూడాలని కోరారు. అంతేకాకుండా గతంలో వదులుగా ఉన్న విద్యుత్ తీగలు భవనాలకు తగిలి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ, డీఈలతో పాటు నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

లింగారెడ్డికి సన్మానం

అబిడ్స్: ఆర్ అండ్‌బీ శాఖలో చీఫ్ ఇంజినీర్ (ఎలక్ట్రిల్)గా పదోన్నతి పొందిన వై.లింగారెడ్డిని బీఎస్ఐ సభ్యులు నరేష్ ఘనంగా సత్కరించారు. కొన్ని సంవత్సరాలుగా ఆర్అండ్‌బీలో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేసిన లింగారెడ్డికి పదోన్నతి లభించి చీఫ్ ఇంజినీర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా బీఎస్ఐ సభ్యులు నరేష్ ఆయనను ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ.. ఆర్ అండ్‌బీలో ఉత్తమ విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న లింగారెడ్డి కృషి అమోఘమని కొనియాడారు.



చీఫ్ ఇంజినీర్ లింగారెడ్డిని సత్కరిస్తున్న బీఎస్ఐ సభ్యులు నరేష్

మహంకాళేశ్వరి మహాభిషేకానికి ఏర్పాట్లు

చార్మినార్: ఆషాఢమానం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 20న మహంకాళేశ్వర పరివార సహిత మహంకాళేశ్వరి మహాభిషేకం పూజా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. లోక కల్యాణార్థం మహంకాళేశ్వరి మహాభిషేకం కార్యక్రమాన్ని ఉత్సవాల నిర్వాహకులు ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈసారి జరిగే ఉత్సవాలను కొడకండ్ల శ్రీరామశరణ్ శర్మ, అలంకార బ్రహ్మశ్రీ శృంగారం ఆత్రేయాచార్యుల నిర్వాహణలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అంజనేయ స్వామి, నవగ్రహ తదితర ప్రత్యేక అభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహాభిషేకం సందర్భంగా భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఇప్పటి నుంచి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నాంపల్లి: ప్రతి ఒక్కరూ తమ గృహ పరిసరాలను, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సింగరేణి జనరల్ మేనేజరు (కో ఆర్డినేషన్) సురేష్ పిలుపునిచ్చారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాలపై సింగరేణి వ్యాప్తంగా 15 రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛతా పఖ్వాడా (స్వచ్ఛత పక్షోత్సవాలు) కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ప్రారంభించి ప్రసంగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడు వ్యాధులు ప్రభలుతాయని, అప్పుడు వైద్యం కోసం భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుందని, అయితే ముందుగానే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రారంభిస్తే వ్యాధుల బారిన పడకుండా ఉంటూ ఖర్చులు తగ్గించుకోగలుగుతామని అన్నారు. సింగరేణి సంస్థ ఏటా స్వచ్ఛత పఖ్వాడా నేపథ్యంలో అన్ని ఏరియాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతుందని, గనులు, కార్యాలయాలను, పరిసరాలను శుభ్రపరిచడం, కాలనీలు, వీధులను శుభ్రపరచడం, మొక్కలు నాటడం వంటి పనులను చేపడుతోందన్నారు. ఇది ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రతిఒక్కరూ తమ కోసం తమ కుటుంబం కోసం చేపడుతున్న కార్యక్రమంగా భావించి స్వచ్ఛందంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సామూహికంగా స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు.

కొనసాగుతున్న మహంకాళి వజ్రోత్సవాలు

యాకుత్‌పురా: హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయం 75వ వార్షిక బోనాల వజ్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 52వ రోజు సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల కుటుంబీకులు అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, కార్యనిర్వాహ కార్యదర్శి ఎస్.పి క్రాంతికుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.



బీసీలందరికీ 'బీసీ బంధు' వర్తింపజేయాలి

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్రంలోని బీసీలందరికీ బీసీ బంధు పథకం వర్తింపజేయాలని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ చిట్టబోయిన నందకిశోర్ యాదవ్, సభ్యుడు పాండుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గౌలిగూడలోని యాదవ సంఘంలో ఏర్పాటు చేసిన యాదవ కులాల, సంఘాల సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జోక్యం చేసుకొని సీఎం కేసీఆర్‌ను ఒప్పించి యాదవులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్ యాదవ్, రామారావుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రమేష్‌యాదవ్, రాజుయాదవ్, సత్యంయాదవ్, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మురళీ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నంద కిశోర్ యాదవ్, పాండూ యాదవ్

వీరశైవ లింగాయత్‌ల అభ్యున్నతికి నిధులను కేటాయించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులకు ఇస్తున్న లక్ష రూపాయాల ఆర్థిక సాయం వీరశైవ లింగబలిజ కులస్తులకు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడు వి.ఈశ్వరప్ప కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్ని వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి కార్పొరేషన్లను ఏర్పాటు చేసి నిధులను కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోను వీరశైవ లింగాయత్ అభివృద్ధికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, యువజన అధ్యక్షులు కె.రాజప్ప, కేంద్రకమిటీ సభ్యులు డాక్టర్ కె.శివప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈశ్వరప్ప

మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బీవైఎస్ సభ్యులు



కిషన్‌రెడ్డితో యోగా గురువులు సత్యనారాయణ, లత, సభ్యులు వెంకటేష్, చేతన్

అబిడ్స్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని భారతీయ యోగ్ సంస్థాన్ (బీవైఎస్) సభ్యులు కలిశారు. యోగా గురువులు సత్యనారాయణ, లతతో పాటు బీవైఎస్ సభ్యులు మెట్టు వెంకటేష్, చేతన్, రాజుగుప్తా కలిసి ఈనెల 21న నిర్వహించే యోగా ఇంటర్నేషనల్ డే వేడుకలకు రావాలని ఆహ్వానించారు. భారతీయ యోగ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కులో యోగా ఇంటర్నేషనల్ డే వేడుకలు జూన్ 21న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు భారతీయ యోగ్ సంస్థాన్ ఉచితంగా యోగా నేర్పుతూ.. ప్రజలు ఆరోగ్యకరంగా ఉండే విధంగా చేస్తున్న కృషి అమోఘమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నగరంతో పాటు దేశ నలుమూలలా భారతీయ యోగ్ సంస్థాన్ యోగా ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు గర్వకారణమని మంత్రి కొనియాడారు.

నిలోఫర్‌లో రక్తదాన శిబిరం

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిలోఫర్ ఆస్పత్రిలో తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం సెంట్రల్ జోన్ పోలీసులు రక్తదానం చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం సెంట్రల్ జోన్ కమాండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్ వారి సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో తెలంగాణ ప్రత్యేక రక్షణ దళ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ పి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. మహిళలు, చిన్న పిల్లల చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రిలో రక్తం కొరతను అధిగమించుటకు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి అభ్యర్థన మేరకు సుమారు వంద యూనిట్ల రక్తాన్ని సేకరించి అప్పగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.హరి జె.వి.రమణారెడ్డి, ఎస్.బాబు రెడ్డి, ఎస్.రాఘవేంద్ర, ఇన్‌స్పెక్టర్లు ఎం.ఎస్.రెడ్డి, బండి రాజు, శ్రీధర్ గౌడ్, జి.శ్రీనివాసరావు, ఎస్సైలు, ఏఎస్సైలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు చక్కటి అవకాశాలు



పాలిటెక్నిక్ విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తున్న డాక్టర్ రాజేశ్వరీ దేవి

విజయనగర్‌కాలనీ: పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని సంస్థలు పరిశ్రమల్లో చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరీ దేవి తెలిపారు. డిప్లొమా కోర్సులపై శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సివిల్, ఎలక్ట్రిషియన్, మెకానిక్ తదితర విభాగాలలో డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులకు త్వరితగతిన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంచి తద్వారా ఉద్యోగా, ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు ఈ కోర్సులు దోహద పడుతాయన్నారు. అవగాహన కార్యక్రమంలో ఎం.లక్ష్మయ్య, పి.రామిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో రైతుబజార్ ఏర్పాటు చేయాలి

గోల్కొండ: షేక్‌పేట్‌లో రైతుబజార్ ఏర్పాటు చేయాలని స్థానికులు సుదీర్ఘకాలంగా అధికారులను కోరుతున్నారు. గత దశాబ్దం కంటే నేడు షేక్‌పేట్ డివిజన్ ఎంతగానో అభివృద్ధి చెందింది. కాలనీలు కూడా వెలిశాయి. ఈ ప్రాంతం వారు కూరగాయలు కొనాలంటే మెహిదీపట్నం రైతుబజార్ లేదా గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తుంది. దీంతో వారు వ్యయప్రయాసాలకు లోనవుతున్నారు. షేక్‌పేట్, టూంబ్స్ చౌరస్తాలో జరిగే వారాంతపు సంతలలో సైతం వ్యాపారులు తాజా కూరగాయలను అమ్మడం లేదని, ధరలు కూడా ఎక్కువగా ఉంటాయని స్థానికులు అంటున్నారు. టూంబ్స్ చౌరస్త వద్ద గల విశాలమైన రక్షణ శాఖకు చెందిన కొంత స్థలంలో రైతుబజార్ ఏర్పాటు చేస్తే సుమారు 70 కాలనీల వారికి ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం మెహిదీపట్నంలో కొనసాగుతున్న రైతుబజార్ కూడా రక్షణ శాఖ వారికే చెందినది కావడం గమనార్హం.